15

బతుకు పయనం

"....పిల్లవాడు బెంగుళూర్లో సాఫ్టువేర్ యింజనీర్‌గా పని చేస్తున్నాడు. మ్యారేజీ బ్యూరోలోంచి బయోడాటా రాసు కొచ్చిన. పిల్లవానితోటి ఫోన్లో మాట్లాడిన. ఈ సంబంధం సెటిల్ అయ్యేట్టు కనపడుతున్నది. వాళ్ళకు కట్నం మీద కూడా పెద్ద పట్టింపులు లేవన్నరు. అమ్మాయికి స్టేట్స్‌లో సాఫ్టువేర్ యింజనీర్‌గా పనిచేసే అర్హతలుంటే చాలు అని అన్నరు.

అతడు వితిన్ వన్నియర్‌ల స్టేట్స్‌కు పోయే అవకాశం ఉందట. మీ నేటివ్ అక్కడే గద. మీరొకసారి పోయి పిల్లవాని ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ తెల్సుకుంటే మన దివ్య గురించి ప్రొసీడవుదాం".

బీడియల్‌ల్లో సైంటిస్ట్‌గా పని చేస్తున్న శివరాజం ఫోన్లో అరగంట నుంచి చంద్రమౌళిని మళ్ళీ మళ్ళీ బతిమాలుతున్నాడు.

"అలాగే-అలాగే. నాక్కూడా కొంత రీసెర్చ్ వర్కుంది. రెండు మూడు రోజులు అటే వుంట. వాళ్ళ ఊరికి కూడా పోయొస్త. ఓ.కె. తప్పకుండా..." అంటూ ఫోన్ పెట్టేశాడు చంద్రమౌళి.

ఆరోజు సాయంత్రమే జగిత్యాల బయల్దేరాడు చంద్రమౌళి.

జగిత్యాల మిషన్ కాంపౌండ్‌లో రామేశం అనే ఫ్రెండింట్లో దిగిన చంద్రమౌళి పెళ్ళి సంబంధం గురించి రొటీన్‌గా అడిగాడు. రామేశం అయిదారుగురికి ఫోన్ చేసి వివరాలు రాబట్టాడు.

"ఆ పిల్లవాని తండ్రి లస్మయ్య... కటకం లింగయ్య దగ్గర కూలికి బట్టలు నేస్తడట. ఒక తమ్ముడు, యిద్దరు చెల్లెండ్లున్నరట. మొత్తం ఫ్యామిలీల చదువుకొని ఎదిగింది ఆ పిల్లవాడొక్కడే. చెల్లెండ్లు బీడీలు చేస్తున్నరు. తమ్ముడు డిగ్రీ ఫెలయిండు" అంటూ వివరాలు చెప్పుకొచ్చాడు రామేశం.

"నాకక్కడ కోళ్ళఫారంలో కొంత పనుంది. అన్నంతిని పోదాం" అన్నాడు రామేశం.

భోంచేసి సైకిల్ మోటార్ మీద రామేశం, చంద్రమౌళి ఆ వూరికి బయల్దేరారు. కొత్తగా మెరుస్తున్న తార్రోడ్డు. ఎటు చూసినా పచ్చని పొలాలు, పెరండ్లు. చల్లని హాయిగొలిపే గాలి, ఎంతో హాయిగావుంది చంద్రమౌళికి. రామేశం కోళ్ళఫారం కాడ బండి ఆపాడు.

"అయ్యో! అప్పుడే ఊరు వచ్చేసిందా? అరగంటైనా కాలేదు" అన్నాడు చంద్రమౌళి.

"రోడ్డు చాలా బాగుంది. అందుకని జెల్టి వచ్చినం." అన్నాడు రామేశం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మెచ్చుకున్నాడు రామేశం.

"మునుపు సైకిల్ మోటార్ మీద యిక్కడికి రావాలంటే రెండు గంటలు పడ్తుండె. రోడ్డంత బురద, కయ్యలు, వాగులల్ల ఉసికెల కెల్లి బండి నూక్కుంట రావాల్సి వస్తుండె." అన్నాడు రామేశం మళ్ళీ.

"నమస్తేసార్" అంటూ కోళ్ళఫారం యజమాని గంగాధర్ వారిని సాదరంగా ఆహ్వానించాడు.

"కోళ్ళు, కోడిగుడ్ల ప్రొడక్షన్ ఎంతుంది? వాటిదాణా, రోగాలు, చిక్స్ గురించిన జాగ్రత్తలు అన్నీ చర్చించుకున్నారు వాళ్ళు. మధ్య మధ్య తనకొచ్చిన సందేహాలు అడిగాడు చంద్రమౌళి.

కోళ్ళఫారం చుట్టూ భలే చెట్లు పెంచారు అనుకున్నాడు చంద్రమౌళి. చంద్రమౌళికి కోళ్ళ ఫారాన్నంతా తిప్పి చూపించాడు గంగాధర్. అంతా కోళ్ళ పెంట వాసన.

"ఈతకల్లు తెప్పియ్యనా బావా? సార్ పట్నం నుంచి వచ్చిండు. ఈ పల్లె స్పెషాలిటీ రుచి చూడాలె గద" అన్నాడు గంగాధర్.

"ఈసారు ఏదీ తాగడు. నేనియ్యాల్ల ముట్ట. ఒక్కపొద్దు" అన్నాడు రామేశం.

కాసేపటికి కొబ్బరి చెట్లకు గులాబీ పొదలకు మధ్య కుర్చీలు వేసుకొని కూర్చున్నారు. రామేశం విషయం కదిలించాడు.

“రవికి సంబంధాలు మస్తుగనే వచ్చినై గని చూసుకుంట మర్రిపోతున్రు ఒక్క సంబంధం గూడ పెళ్ళిచూపుల దాక రాలే!” అన్నాడు గంగాధర్.

“అదే! గట్లా?” రామేశం అడిగాడు.

“ఏం చెప్పాలె సార్ వానికత? తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లెండ్లు అందరికి వాడొక్కడే పెద్ద దిక్కాయె. వాని సదువు కోసం పైసలు గావాల్నని బిడ్డలను ఏడో తరగతికే సదువు బందు పెట్టిచ్చి బీడీలు చెయ్యపెట్టిన్రు. వాడు అమెరికాపోయె లెవల్‌కు ఎదిగితే చెల్లెండ్లను కనీసం టీచర్లకన్న యియ్యాలెగద. ఏడోతరగతి పిలగాండ్లను ఈకాలం టీచర్లు ఎవలు మెచ్చుతరు! తనంత చదివిన పిల్ల గావాలంటరు. అందుకని కట్నం ఎక్కువ యిచ్చయినా టీచర్లను చూడాలె అనివాని తపన. వాని బుద్ధి మంచిదేగని పెండ్లయినంక యిద్దరి సంపాదన ఏడెనిమిదేండ్ల దాక ఇంటికే ఖర్చు పెట్టాలె అని అంటే ఈకాలం ఆడిపిల్లలు ఎవలు వింటరు? పిల్లకన్నా ముందు ఆపిల్ల తల్లిదండ్రులే మెచ్చుతలేరు. నేతశాలోనింటికి పిల్లనిచ్చుడే మహా ఎక్కువ అని ఏదో పిల్లగాడు బెంగుళూర్లోనో, అమెరికాలోనో ఉంటడు. అల్లుడు బిడ్డ మంచిగ సుఖంగ ఉంటరు అనుకుంటే ఈ గంపెడు సంసారం ఎల్లదీసుడా?” అంటూ ఏ సంబంధం ఎట్లా ఎత్తి పోయిందో వివరించాడు గంగాధర్.

చంద్రమౌళికి ఆశ్చర్యం వేసింది. అంత పట్టుదలతో ఉన్న పిల్లవాడి ఆదర్శాల పట్ల ముచ్చటేసింది.

“బెంగుళూర్లో కొడుకు ఉద్యోగం చేస్తుంటే ఇంకా కూలికి నేసుడేంది? సొంతం మగ్గం పెట్టుకోరాదా” అని అడిగాడు చంద్రమౌళి.

“వాడు మా అంటండు. అసలు మగ్గం నేసుడు బందు పెట్టుమనిగూడ అంటండు. కని మా అన్న యింటలేడు. ఇన్నిరోజులు కూడు పెట్టిన ఈమగ్గం నేను బందుపెట్ట అన్నడు. పోనీ సొంతమగ్గం పెట్టుకో అంటే నూలు కొనుక్కచ్చుడు, బట్టలు మల్ల సేట్లకు అమ్ముడు - ఇదంత దంద ఎవలు పెట్టుకుంటరు. నేను కూలికే నేస్త- స్వంతమగ్గం వద్దు అని అన్నడు మా అన్న”.

"మీలాగా కోళ్ళఫారం పెట్టుకుంటే బాగుండేది గద". అన్నాడు చంద్రమౌళి.

"ఇది రిస్కుదండ. ఇంత రిస్కు మా అన్నతోటి ఏమైతదిసార్? సొంత మగ్గమే వద్దన్నోని తోటి కోళ్ళఫారం నడుపుడు అయితదా? ఏందో వైరాగ్యంలో పడ్డడు. ఎనుకట మా అన్నకు సొంత మగ్గమే ఉండె. చీరలు మంచిగ నేస్తడని పదివూర్లపెట్టు మంచి పేరుండె. ఎక్కడెక్కణ్ణుంచో వచ్చి సంచకరి (అడ్వాన్స్) ఇచ్చి నేయించుకుందురు. ఇప్పుడాకాలాన్ని కుక్కెత్తుకుపోయె...నేతగాళ్ళ బతుకులన్నీ గిట్లయిపోయె". పాత జ్ఞాపకాలు గుర్తొచ్చి గంగాధర్ అదోలా అయ్యాడు. తానుకూడా వైరాగ్యంలో పడ్డాడు.

"ఎంసెట్ కౌన్సిలింగ్‌కు నేనే వెంటపోయిన. ఫీజు గూడ నేనే సదిరిన. ఉద్యోగానికెక్కినంక అన్ని ముట్టజెప్పిండనుకోన్రి" అన్నాడు గంగాధర్.

"ఈ సారు గూడ పెళ్ళి సంబంధం పనిమీదనే వచ్చిండు. వీళ్ళ దగ్గరి దోస్తు బిడ్డ ఉందట. తండ్రి పెద్ద ఆఫీసరట. అయితే పిల్లకు కొద్దిగ మెల్లకన్ను. అద్దాలు పెట్టుకుంటే మామూలుగనే కనపడ్తది. కలర్ మనతీరు మామూలు గుంటది. తెల్లగుండది" అంటూ అసలు విషయం వివరించాడు రామేశం.

"వానికి అవన్ని పట్టింపులేం లేవు. మీరు మెచ్చితే సాలు. నేను వాన్ని ఒప్పిస్తబావా! వాడు నామాట కాదనడు. నేను నీమాట ఎన్నడన్న కాదన్ననా! నువ్వు అన్ని చూసి పిల్ల మన పిల్లగానికి మంచి మ్యాచ్ అని నీకన్పిస్తే ఒప్పిద్దాం బావా"... అంటూ చంద్రమౌళి కేసి తిరిగి మరైతే వాల్ల యిల్లు చూద్దురు - రండి సార్" అంటూ బయలు దేరదీశాడు గంగాధర్.

సైకిల్ మోటార్ అక్కడే వుంచి కాలినడకన బయల్దేరారు. దడి పొంట బీరకాయలు, కట్ల పువ్వులు, బోడ కాకర, సొరకాయలు, అంత తాజాగా చూస్తుంటే చంద్రమౌళికి ఆహ్లాదంగా వుంది.

తోవెంట చిటుకం పటుకం అని వినపడుతుంటే చంద్రమౌళి ఆసక్తిగా అడిగాడు.

"ఈ వూర్లె చేనేత మగ్గాలు బాగానే ఉన్నట్టున్నాయి".

"ఎక్కువేం లేవు. ఉండుటానికి 60 మగ్గాల దాక ఉన్నయి. కని 20-25 మందే నేస్తున్నరు. అది కూడా ధనికి అంటే మాస్టర్ వీవర్‌కు కూలికి నేస్తున్నరు. ఎక్కువ కెక్కువ లుంగీలు, తువ్వాలలు నేస్తుంటరు. అప్పుడప్పుడు చీరెలు గూడ నేస్తుంటరు. ఎనిమిది తొమ్మిది గజాల చీరలు మార్కెట్ల ఎక్కువ దొరుకై. అందుకని ఆర్డరిస్తే అవి నేస్తుంటరు." అన్నాడు గంగాధర్.

"ఈ వూర్లెశాలోల్లు ఎన్ని కుటుంబాలుంటై" ఆసక్తిగా అడిగాడు చంద్రమౌళి.

"ఇరవై ఏండ్ల కింద నూరు కుటుంబాలుండె. ఆల్లందరు యిక్కన్నే వుంటే తక్కువకు తక్కువ మూడువందల కుటుంబాలైతుండె. కని యిప్పుడు 50 గడప వుండచ్చు. మిగిలినోల్లందరు పొట్ట చేతపట్టుకొని ఏదో ఒక పని వెతుక్కుంట ఎటెటో పోయిన్రు. ఒక ఊరుగాదు-ఒక రేవు గాదు. ఒక పని గాదు". శిథిలమైన కుటుంబాలు, సంబంధాలు... ఏవేవో గుర్తొచ్చి మళ్ళీ విషాదంగా వైరాగ్యంలో పడ్డాడు గంగాధర్.

భూమికి మూరెడు ఎత్తులోనే ఉన్న ఊచలకిటికీ నుండి ఎలుకను కరుచు కొని పిల్లి బయటకు దూకి సర్రున ఎటో ఉరికింది.

"ఆ యింట్ల యిపుడు ఎవలుంటలేరు. వీళ్ళు జగిత్యాల్లో యిల్లు కట్టు కున్నరు. ఆ యిల్లు అమ్ముతనంటె ఎవలు కొంటలేరు. దీనికి కట్టెనే యాభయివేల రూపాయలది ఎల్తది. అయినా మూడుగుంటల జాగ, యిల్లు అంత కల్సి 25 వేలకు ఇస్తనన్నా ఎవరు కొంటలేరు".

"ఎందుకట్లా!" అడిగాడు చంద్రమౌళి.

"పల్లెటూర్లల్ల ఎవలుంటున్రు సార్. అదిగాక వాల్లు ఏమని శరతు పెట్టిన్రంటే - ఆ యిల్లు విప్పద్దు. అన్లనే వుండాలె. ఆ యింట్ల దీపం పెట్టాలె. ఇంటి ముంగట అలుకు చల్లి యింట్ల దీపం పెట్టుటానికే అది అమ్ముతనంటున్నరు - పైసల్లేక కాదు. యిల్లు యిప్పి కట్టె కోయించి అమ్మితే 50 వేల కట్టె ఎల్తది. పైసల కోసం కాదు అమ్ముతున్నది. మేం ఈ యింట్ల పుట్టి పెరిగినం. అచ్చి వచ్చిన లక్ష్మిగల యిల్లది. రెండులక్షలు పెట్టినా

ఈకాలంలో యింత యిల్లు కాదు అని అంటరు. అందుకే ఒకలు ఎడ్లకొట్టంకోసమని 35 వేలకు అడిగినా యియ్యలేదు" అన్నాడు గంగాధర్.

"ఈ ఇంటాయన ఏం చేస్తడు!"

"అల్లకేంది సార్. నలుగురన్నదమ్ములు నాలుగు రకాల పనులు చేసుకుంటున్రు. పెద్దాయన లింబాద్రిది జగిత్యాల్లో హోల్ సేల్ బట్టల వ్యాపారం. నడిపోడు జగిత్యాల నుంచి హైద్రాబాద్ దాకా ప్లాట్లు, రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తుండు. ఒకాయన బార్ షాప్ పెట్టుకున్నడు! అందరికన్న చిన్నోడు ఎం.ఎ., బీయిడి చేసి జగిత్యాల్లోనే స్కూలు పెట్టుకున్నడు. ఎనిమిది వందల మంది స్టూడెంట్స్, స్కూలుకోసమని ఊరిబయట కొన్న రెండెకరాల జాగ యిపుడు గజానికి రెండువేల చొప్పున ఊ అంటే ప్లాట్ల కింద అమ్ముడువోతది. వాల్లు చిన్నప్పట్నుంచి ఎంతకష్టపడ్డరో... యిపుడు కార్లు మేన్‌టేన్ చేస్తున్నరు. వీల్లందరు చిన్నప్పుడు వాల్లనాన్నతోటి నేత నేసినోల్లే. ఆ యింట్ల నాలుగు మగ్గాలు నడిచేటివి... అన్నాడు గంగాధర్.

కొన్ని యిండ్లలో మనుషుల అలికిడే లేదు.

"ఈ యిండ్లల్ల ఏసప్పుడు లేదేంది? ఆశ్చర్యంగా అడిగాడు చంద్రమౌళి.

" ఇవి కాపోల్ల యిండ్లు అందరు పొలాలకు, చేన్లకు పనులకు పోయిన్రు. ఇక కొద్దిగైతే వస్తరు." అన్నాడు గంగాధర్.

కాపోల్ల యిండ్లు దాటితే మళ్ళీ చిటుకం – పటుకం అని మగ్గం చప్పుడు వినపడింది.

"రవిప్రకాశ్ వాళ్ళ యిల్లు యిదే. రండి లోపలికి" అంటూ లోపలికి నడిచాడు గంగాధర్.

"గంగాధర్ వచ్చిండు" అని లచ్చుంబాయి భర్త లస్మయ్యను ఉద్దేశించి అంది. అరుగు మీద రాట్నంతో నూలు కండెలు చుడుతున్న సవ్వడి ఆపింది. రాట్నం, పంటెలు, గిరుక పక్కకు జరిపి అరుగుమీద మంచం వాల్చింది. దానిపై చద్దరుపరిచి కూర్చోమంది. ఓపాత కట్టె కుర్చీ తెచ్చివేసింది. పిల్లలు కత్తిరించిన బీడీ ఆకుల తుక్కును ఒకవైపు నెట్టింది.

లస్మయ్య మగ్గం గుంటలోంచి లేసి ధోతి సింగులు సవరించుకున్నాడు. తువ్వాలుతో మొహం తుడుచుకున్నాడు. మగ్గం కొయ్యకు వేలాడేసిన అంగితీసి తొడుక్కున్నాడు.

అరుగుదాటి యింట్లోకి వచ్చిన రామేశంను "నమస్తే" అంటూ పలకరించాడు లస్మయ్య.

ఇల్లంతా ఫ్యాక్టరీలా వుంది. కుండలో గంజివాసన. గోడకు ఆన్చిన ల్యాకబద్దలు, సరిచేసే ఎరుకలి కుంచె, ఎత్తిన మంచం మీద ఆరేసిన చీరె, మగ్గం గుంట. అటు యిటు పాతిన గుంజలు, నేసిన బట్ట చుట్టిన దోనుగు. ముందుకు చాపి బిగకట్టిన సరిచేసే పడుగు. మగ్గం గుంట పక్కన నాడెలు. భూమికి మూరెడెత్తున ఊచల కిటికీ. అందులోంచి రివ్వున వస్తున్న గాలి. ఆ కిటికిలోంచి నేస్తున్న బట్టపై మెరుస్తున్న వెలుగు...

"మీబిడ్డలు ఎటువోయిన్రు" అని అడిగాడు రామేశం.

"దోస్తుల యింటికాడ కూసుంటమని బీడీల చాట తీసుకొని పోయిన్రు." అంది లచ్చుంబాయి.

లచ్చుంబాయి మట్టిపొయ్యిలో పిడుకలు, కట్టెలు గ్యాస్‌తో ముట్టించి చాయె పెట్టే పనిలో పడింది.

"ఎటో అచ్చిన్రు." అని అడిగాడు లస్మయ్య.

వచ్చిన పని గంగాధర్, రామేశం చెరికొంత వివరించారు.

అంత పెద్ద ఆఫీసరు సంబంధం హైద్రాబాద్ నుంచి యిక్కడి పల్లెటూరి దాకా రావడం లస్మయ్యకు సంతోషం కలిగింది. అతని మొహం పందిరికున్న బీరపువ్వులా వికసించింది.

"మరి కొడుకు అమెరికా వోతే మీరు గూడా పోవాల్సే వస్తది. కొడుకు, కోడలు ఉద్యోగాలకు పోతే మనుమలు, మనమరాండ్లను చూసుకుంట మీరు అమెరికాల్నే ఉండాల్సి వస్తది". నవ్వుతూ అడిగాడు రామేశం.

"ఆ! ఇక్కడ బిడ్డలు లేరా! యింకో చిన్న కొడుకు లేడా? మేం అమెరికా కాదు గదా ఈ వూరినుండి ఎక్కడికి పోయేదిలేదు. అయినా వాడు అయిదా

రేండ్లుండి మల్ల మనదేశమే వస్తనన్నడు. చెల్లెండ్ల పెండ్లిల్లయి, మనకొకటి పట్నంల యిల్లు కొనుక్కునేదాక అక్కడుంట అన్నడు". అని అన్నాడు లస్మయ్య.

"పోయేటప్పుడు అందరు గట్లనే అంటరే! అక్కడి సుఖం అలవాటైనంక ఎవలు వాపసు రారు". నవ్వుతూ అన్నాడు రామేశం.

లచ్చుంబాయి అందరికి చాయె ఇచ్చింది. తమ యింటికి ఎవరో వచ్చిన్రని తెల్సి యిద్దరు కూతుళ్ళు పరుగు వంటి నడకతో వచ్చారు.

"ఇది పెద్దది. ఇది చిన్నది" అంటూ పరిచయం చేశాడు లస్మయ్య.

ఆ కళ్ళల్లో అమాయకత్వంతో పాటు మా అన్న బెంగుళూర్లో యింజనీర్ అనే ఆత్మవిశ్వాసం వాళ్ళ మొహాల్లో తేజస్సయి ప్రవహిస్తోంది. తండ్రి చేతిలో ఉన్న అమ్మాయి ఫోటోను తీసుకొని ఒకటికి రెండు సార్లు చూశారు.

సంబంధం స్థాయికి వాళ్ళు మెచ్చేట్టు మాట్లడ్డం ఒక కళ అని చంద్రమౌళికి తెల్సు. "వాళ్ళు కూడా బాగ ఉన్నోల్లు ఏంకాదు. వాల్ల తండ్రి కూడా బట్టలు నేసినోడే. వాల్లు పెద్దోల్లు కాదు. మీరు చిన్నోల్లు కాదు. వాల్లేమో యిరవై అయిదేండ్ల కింద సదువుకొని పైకి వచ్చిన్రు. మీవోడు యిప్పుడు పైకి వచ్చిండు. వాల్లు గూడా ఎనుకట మీతీర్గనే బతికిన్రు. వాల్లే అని ఏంది? మనందరం గంతే". అన్నాడు చంద్రమౌళి.

చంద్రమౌళికి తనగతమంతా గుర్తుకొచ్చింది. తాను ఓ పూట బట్టలు నేసుకుంట, ఓపూట కాలేజీకి పోవుకుంట చదువుకున్నాడు. తల్లీదండ్రీ ఎంతో కష్టపడ్డారు. అవన్నీ కలుపుగోలుగా చెప్పుకొచ్చాడు చంద్రమౌళి.

లస్మయ్య బిడ్డలకేసి, వాల్ల తల్లికేసి చూశాడు. వాళ్ళు మెచ్చినట్టే అన్పిస్తోంది.

"కొడుకు ఏమైన ఫోన్ చేసిండా?" రామేశం అడిగాడు.

"నిన్ననే ఫోన్ చేసిండు. పిల్లకు ఉండీలేనట్టు కొద్దిగా మెల్ల కన్నుంటదట. ఏర్పడదట. వాల్ల తరఫున ఎవరైన వస్తరు గావచ్చు. పిల్లోల్లకు మనయిల్లు, మన కుటుంబం నచ్చితే, మీక్కూడా మంచిగ అన్పిస్తే వాల్లు రమ్మంటే ఓసారి పోయి చూసిరాన్రి అని చెప్పిండు" అని అన్నాడు లస్మయ్య.

"మరి పెట్టుపోతలు ఏమనుకుంటున్రు" అని ఆరాతీశాడు రామేశం.

ఈ విషయం లస్మయ్యకు మాట్లాడరాదని లచ్చుంబాయి చెప్పుకొచ్చింది.

"పెద్ద బిడ్డకు సంబంధాలు చూస్తున్నం. ఒకటి దొరింపు అయ్యేటట్టున్నది. సర్కార్ ఉద్యోగం రాలేదు. అయిదారు నెల్లల్ల వస్తదంటన్రు. నాలుగు కావాలంటున్రు. చిల్లర కర్సులు, పైకర్సులు ఒకటి దాటుతై. పెద్దోని పెండ్లితోని పెద్ద బిడ్డ పెండ్లి కర్సు ఎల్లిపోవాలనే కొడుక్కు ముందుగాల సంబంధాలు చూస్తున్నం" అన్నది లచ్చుంబాయి. పిలగానోల్లు అడిగిందానికన్నా ఒకటి ఎక్కువనే చెప్పిన అని లచ్చుంబాయి లోలోన సంతోషపడింది.

అంటే సుమారు అయిదు లక్షలు అనుకున్నాడు చంద్రమౌళి మనస్సులో. చంద్రమౌళికి సంతోషం వేసింది. శివరాజం దివ్యకు ఎనిమిది పది లక్షలు నగదు యిచ్చుటానికి యాడాది నుంచి రడీగ ఉన్నడు. ఇంత తక్కువైతే యింతమంచి పిల్లగానికి తన బిడ్డనే యివ్వచ్చు. ప్రవీణ బి.టెక్ ఫైనల్ చదువుతనే వుండె. దివ్య కన్నా ఎంత ముద్దుగుంటది – అని మనస్సులో కొట్టుకుంది. తన బిడ్డ ప్రవీణ ఫోటో కూడా వెంట తీసుకొస్తే ఎంత బాగుండేది అనుకున్నాడు చంద్రమౌళి.

రామేశం, చంద్రమౌళి అట్లా వాకిట్లోకి నడిచి ఏదో ముచ్చటించుకున్నారు. చంద్రమౌళి సెల్‌ఫోన్లో పిల్ల తండ్రి శివరాజంతో కాసేపు మాట్లాడాడు. అన్ని విషయాలు మా ఫ్రెండు రామేశం చెప్తాడు అని సెల్‌ఫోన్ రామేశంకిచ్చాడు. రామేశం, గంగాధర్ కల్సి అన్ని విషయాలు వివరించారు. రవి ప్రకాశ్‌కు ఫోన్ కలిపి గంగాధర్ కాసేపు మాట్లాడాడు. ఒక నిర్ణయానికొచ్చి మళ్ళీ అందరు అరుగుమీద మంచంలో తాపీగా కూర్చున్నారు.

"మరి ఎప్పుడు పోతరే పిల్లను చూసుటానికి. ఇగో ఈ విజిటింగ్ కార్డుల అడ్రసున్నది. గంగాధర్‌ను తీసుకొని ఓసారి చూసిరాన్రి." అన్నాడు రామేశం.

"అంటే నువు రావా? అసలు పెద్ద మనిషివి నువ్వు రాకపోతే ఎట్ల?" అన్నాడు రామేశం వ్యవహార సరళి తెల్సిన లస్మయ్య.

"మీరు రమ్మంటే తప్పుద్దా?" అంటూ నవ్వాడు రామేశం.

సంబంధం యిక ఖాయమైనట్టేనని యిరుపక్షాలకు మనస్సులో ఒక భావన మెదిలింది.

❄ ❄ ❄

రెండు నెలల తర్వాత రవిప్రకాశ్‌కూ బీడీయల్ శివరాజంగారి కూతురు దివ్యకు హైద్రాబాద్‌లో పెళ్ళి దివ్యంగా జరిగింది. అయితే లచ్చుంబాయి, లస్మయ్యలకు ఆగం ఆగంగా ఆ పెళ్లి జరిగిన తీరు ఎందుకో నచ్చలేదు. కొడుకు లీవ్ దొరకలేదని పెళ్లికి ఐదు రోజుల ముందు వచ్చాడు. పెండ్లి పద్ధతులేవి చేయడానికి వీలేకాలేదు. ఇంటికాడ పెండ్లయినట్టే అనిపించలేదు. పెళ్లయిన మూడు రోజులకే హానిమూన్ పేరిట బీడియల్ శివరాజం అల్లుడిని, కూతురిని టికెట్లుకొని పంపించాడు. బిడ్డ పెళ్లి పెట్టుకొని ఇట్ల ఊర్లు తిరుగుడేందో లస్మయ్యకు అర్థంకాలేదు. రామేశం సముదాయించాడు.

"మనచిన్నప్పుడు పది పదిహేనేండ్లకే లగ్గాలైనై. పండుగు పండుగుకు అల్లుడు బిడ్డ అటు ఇటు తోల్కపోవుడు, తోల్కచ్చుడు ఉంటుండే. అట్లా సుట్టరికం, మనుషులు పరిచయం అవుదురు. పాతపడుదురు. ఇప్పుడు పెద్దపెరిగినంక పెండ్లిండ్లు గావట్టె. గందుకని పిల్లా, పిల్లగానికి పరిచయాలు పెరగాలని గిట్ల కొద్దిరోజులు హానిమూన్‌కు అని పంపిస్తున్నరు. అంటే పెండ్లయినంక ప్రేమించుకొనుడు అన్నమాట. మీ బిడ్డ పెండ్లికి మేమందరం లేమా!" అని సముదాయించాడు రామేశం.

పదిహేను రోజుల తర్వాత లస్మయ్య పెద్దకూతురు విజయ పెళ్ళి లస్మయ్య కోరుకున్నట్టుగానే ఆపల్లెలో ఘనంగా జరిగింది. రవిప్రకాష్, గంగాధర్ చిన్నాన, రామేశం ఎలా చెపితే అలా ఖర్చులు, కట్నాలన్నీ పెట్టాడు. దివ్యకు ఇవన్నీ కొత్తగా అనిపించాయి. చాలా ఆసక్తిగా అన్ని గమనించింది.

పెండ్లికి ఐదు రోజుల ముందు పోచమ్మకు చేసి చుట్టాలందరికి మేక పోతును కోసి బోజనాలు పెట్టాడు. లస్మయ్య, గంగాధర్ మామయ్యలే సొంతంగా వంటలు చేయడం దివ్యకు వింతగా అనిపించింది.

పెళ్లి కూతురు విజయకు ప్రత్యేకంగా పెండ్లి చీరను లస్మయ్య తానే నేశాడు. గంగాధర్ రెండు రోజుల ముందు విజయకు పెళ్లికూతురును చేయడం

అనే ఫంక్షన్ చేశాడు. తోడు పెళ్లికూతురుగా తొమ్మిదవ తరగతి చదువుతున్న తన కూతుర్ని పంపాడు గంగాధర్.

కుండలను సున్నంతో, ముగ్గులతో అలంకరించి ఐరేండ్ల పూజ చేశారు. ఏడు గాడిపొయ్యిలు తీశారు. వెనుకట ఎడ్లబండ్లమీద వచ్చేవాళ్లకోసం దుమ్ము ధూళి ఉంటుందని స్నానాలకు, వంటలకు గాడిపోయిలు పెట్టి అడివి నుంచి కట్టెలు కొట్టుకొచ్చి అట్లనే పొయ్యిలో పెట్టేవాళ్లు. కుండల్లో ధాన్యం దాచుకునేవారు. అవి పోయినా ఆ ఆచారాలు అలాగే కొనసాగుతున్నాయి.

'అందుగు' కొమ్మను చప్పుడుతో ఎదుర్కొచ్చి ఇంటిముందు పాతిపెట్టి మట్టితో గద్దె కట్టారు. ముత్తయిదువలు బావికి పూజచేసి కొత్త బిందెల్లో నీళ్లు తెచ్చారు. కొత్త కుండలతో కూరాళ్లు పట్టారు. కూరాళ్లు పట్టడం ఆడవాళ్ళ దృష్టిలో చాలా ముఖ్యమైన కార్యక్రమం. ముత్తయిదువలు యిసురు రాయితో పసుపు విసిరి పెట్టారు.

వాకిట్లో కొబ్బరి ఆకులతో పెండ్లి పందిరి వేశారు. రంగు కాగితాలు, డిజైన్లతో పెండ్లి పందిరిని అలంకరించారు. బాసింగాలు పోచమ్మ గుడికి చప్పుడుతో తీసుకుపోయి మొక్కి తీసుకొచ్చారు. పోచమ్మ గుడికి పోయి ఇంటికి చేరేదాకా దుప్పటిని గొడుగులాగా పట్టుకొని నడిచారు. ఈ ఆచారం ఎందుకు మొదలైందో వాళ్లెవరికి తెలియదు. ఎవరోఒకరు గుర్తు చేసినకొద్దీ చెప్పిందల్లా ఆచరించడమే ఆచారాల్లో వస్తున్న తీరు. ఇంటి చాకలి అన్నం, కుంకుమ కలిపి వాళ్ళు ఇంట్లోకొచ్చేటప్పుడు మిత్తి తీశాడు.

ఔసులోళ్ల ఇంటి నుంచి స్వయంగా చేయించిన పుస్తెలు, మట్టెలు చప్పుడుతో మంగలహారతితో ఎదుర్కొచ్చారు. మైకులో పాటలజోరు ఊరంతా వినిపిస్తుంటే పచ్చ జొన్నలతో చాకలి వాళ్లతో, మంగలి వాళ్లతో మైలపోలు తీయించారు.

పెండ్లి పిల్లవాడిని మార్కండేయ గుడి నుండి ఎదుర్కోలుగా పోయి చప్పుడుతో ఎదుర్కొచ్చారు. ఎదుర్కోల్ల దగ్గర ఇరుపక్షాలు పసుపు, కుంకుమ, నోట్లో చక్కెర మర్యాదలు జరిగాయి. పెండ్లి పీటగా బట్టచుట్టే దోనుగుకు కంకణం కట్టి పెట్టారు. దోనుగుమీద కూర్చోబెట్టి అల్లుని కాళ్లు కడిగారు. పెళ్లిలోనే అల్లునికి జంధ్యం వేయించారు.

తరువాత కన్యాదానం కార్యక్రమం... జిలకర బెల్లం పెట్టడం పెళ్లికన్నా ముఖ్యం ఎందుకైందో ఎవరికి తెలియదు. కాళ్లు తొక్కించారు. ఒకరి ఎంగిలి మరొకరికి తినిపించారు. కొంగులు ముడివేశారు. పుస్తెలు కట్టిన తరువాత పట్టపగలే అరుంధతి నక్షత్రం అంటూ చూపారు. పత్తి గింజలు అలికించారు. పెళ్లి పందిట్లో తరాజు పట్టుకొని పిల్ల పిలగాడు మూడు చుట్లు తిరిగారు. ఇంత వివరంగా హైద్రాబాద్‌లో తన పెళ్లిలో ఎందుకు జరగలేదో అని రవిప్రకాష్ మనస్సులో అనుకున్నాడు. ఊరికోతీరు పద్ధతి ఉంటుందని గంగాధర్ అన్నాడు.

పెళ్లికి ఐదు యాటలు కోసి మాంసంతో బోజనాలు పెట్టారు. వియ్యంకుడు బీడియల్ శివరాజం, చంద్రమౌళి వాళ్ల చుట్టాలకు రిసెప్షన్ బోజనాలుకూడా ఇవే అని ముందే అనుకున్నారు. శివరాజంకు ఇవన్నీ కొత్తగా అనిపించాయి. లస్మయ్యకు తృప్తితీరింది.

సాయంత్రం అప్పగింతల కార్యక్రమం జరిగింది. అంతదాకా ఆనందంగా ఉన్న పెళ్ళిపందిరి గంభీరంగా మారిపోయింది. పోకలు, ఎండిన కర్జూర పండ్లు చేతిలో పెట్టి కూతురును అల్లుని చేతిలో, అతని తల్లి దండ్రుల, చిన్నాన, పెద్దనానల చేతిలో పెడుతూ కన్నీరు పెట్టారు. పెళ్లికూతురు విజయ వెక్కివెక్కి ఏడ్చింది. ఎవరో కన్నీళ్లు తుడిచారు. పోయస్తా అంటూ విజయ అందరికి పాదాభివందనం చేసింది.

ఆ సన్నివేశం ముగిసిన తరువాత సాగనంపారు. సాగనంపేటప్పుడు బావమరదులు, పెండ్లి పిల్లగాడ్ని, పెళ్లి పిల్లను నవ్వుతూ అడ్డుకున్నారు. చంద్రమౌళికి అది చూస్తుంటే ఎందుకో రుక్మిణీ కళ్యాణం గుర్తుకువచ్చింది. తమ చెల్లెను తీసుకుపోవటానికి వీలులేదని వాదులాటకు దిగారు. గంగాధర్ కొడుకులు, రవిప్రకాష్ కలిసి ఆడే ఆ నాటకాన్ని అందరు నవ్వుతూ తిలకించారు. బావమరదులు ఐదువేల రూపాయలు కట్నంకింద డిమాండ్ చేశారు. చివరకు ఐదు వందల రూపాయలకు దిగింది. పెళ్లి పిల్లవాని తండ్రి వాళ్ళ చేతిలో ఐదు వందలు పెట్టి సరిపుచ్చుకోమన్నారు. దాంతో ఆ తంతు ముగిసింది. ఆ తరువాత బావమరదులు పెండ్లి పిల్లవాణ్నిచేతుల

మీద ఎత్తుకొని కారుదాకా తీసుకువచ్చారు. చప్పుడుతో ఊరేగింపు ఊరిబయటిదాకా సాగింది. ఆ ఊరేగింపులో కొందరు డ్యాన్సులు చేసారు. రవిప్రకాష్‌కూడా వారితోపాటు కాసేపు ఎగిరాడు.

గంగాధర్, రామేశంలు తాను అనుకున్నదానికన్నా చక్కని ఏర్పాట్లు చేశారని లస్మయ్య, లచ్చుంబాయి మెచ్చుకున్నారు. పెళ్లి తరువాత రెండవరోజు మారుపెళ్లికి పిలవాడింటికి బోజనాలకు వెళ్లారు. మూడవరోజు వియ్యపురాళ్ల వైనం జరిగింది. మళ్లీ మాంసాహార విందు. వియ్యపురాళ్ల వైనంలో ఇటువాళ్లు అటు, అటువాళ్లు ఇటు బంధువులకు, ఆడపడుచులకు, అల్లుళ్లకు కట్నాలు పెట్టుకున్నారు. లస్మయ్య రవిప్రకాష్‌లు గంగాధర్, రామేశం దంపతులకు పెళ్లి ఏర్పాట్లను చూసినందుకు బట్టలు కట్నాలుగా పెట్టి కాళ్లు మొక్కారు. కొడుకుతోపాటు కోడలు దివ్య అందరి కాళ్లు మొక్కింది. దివ్యకు ఇదంతా ఆసక్తిగా ఉంది.

ఆ తరువాత నాలుగు రోజులకు రవిప్రకాష్, దివ్య బెంగుళూర్‌కు వెళ్లిపోయారు. మూడు నెలలకు రవిప్రకాశ్ స్టేట్స్‌కు వెళ్ళాడు. తరువాత నాలుగు నెలలకు దివ్యకు వీసా వచ్చింది. అమెరికా వెళ్లింది.

ఆ తర్వాత కథ అందరికీ తెల్సిందే. అందుకని క్లుప్తంగా చెప్తాను.

ఆ తర్వాత ఏడాదికి రవిప్రకాశ్ చిన్న చెల్లెలుకు పెళ్ళి కుదిరింది. మొత్తం ఖర్చంతా అమెరికానుండే పంపారు గానీ వాళ్ళు పెళ్లికి రావడం వీలుకావడం లేదని చెప్పారు. దివ్య వచ్చి ఏడాదే అయింది కాబట్టి యిద్దరు రావడానికి పోవడానికి ఖర్చులు, నెలజీతం నష్టంకల్సి కష్టం అవుతుందని ఫోన్లో మరి మరి చెప్పారు.

కాని కొందరు... వాళ్ళు అప్పుడే అమెరికా మనుషులైపోయారని ఇక కొడుకు, కోడలు యింతే అని ఆపెళ్ళిలో ఆడిపోసుకున్నారు. మంచిగ బతుకుతుంటే ఓర్వలేక ఏదో ఒకటి అంటారు అని లస్మయ్య, లచ్చుంబాయి మనస్సు నింపుకొని సరిపెట్టుకొన్నారు. అమెరికాలో కొడుకు ఎనిమిది లక్షలు పెట్టి పెద్దకారు కొన్నడని చెప్తే దగ్గరోల్లే ఓర్వలేదు అని యాది చేసుకున్నారు.

కొంత కాలానికి రవిప్రకాశ్ తన తమ్ముడి కోసం యిండియాలో వున్న ఫ్రెండ్స్‌ను కదిలించి ఏదోలారీ ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీ ఖాయంచేసి డిపాజిట్ కట్టాడు. అది బాగా నడుస్తోంది.

అది చూసి పిల్లవాడు బుద్ధికొచ్చిండని ఆవూరి లింబాద్రి జగిత్యాల్లో హోల్‌సేల్ బట్టలవ్యాపారం చేస్తున్నాయన తన కూతుర్ని యిస్తానని ముందు కొచ్చాడు. అది లస్మయ్య, లచ్చుంబాయిలకు ఊహించని గౌరవం. ఒక పట్టాన నమ్మబుద్ధి కాలేదు.

"ఆ! ఏమున్నది బావా! నేను యివ్వాల సేటునైన. కాని నేను ఎనుకట నెలకు పదిరూపాలకు జీతం ఉన్న. మీవోడు లారీ ట్రాన్స్‌పోర్టుతోటి యిప్పుడే సేటయిండు. మీ పెద్దోని చలువ. ఊర్లె దూర్లె తెల్సిన సంబంధం గదా" అని లస్మయ్యను ఒప్పించాడు లింబాద్రి.

రెండు నెలల రాయబారాల తర్వాత పెళ్ళి కుదిరింది. అప్పటికి రవిప్రకాశ్ స్టేట్స్ వెళ్ళి మూడేళ్ళు. వాళ్ళకు కూడా యిండియా చూడాలనిపించింది. ఎమ్మెస్‌కు స్టేట్స్‌కు వెళ్ళిన చంద్రమౌళి కూతురు ప్రవీణకు కూడా పెళ్ళి కుదరడంతో ఇండియాకు వచ్చింది.

ఆ రెండు పెళ్ళిళ్ళలో అందరూ రవిప్రకాశ్‌ను మెచ్చుకున్నారు.

గంగాధర్ రామేశం పెళ్ళి పెద్దలుగా అన్నీ సవరించారు.

రవిప్రకాశ్ యిదంతా మీకోడలుకే చెందుతుందని దివ్యను చూపాడు.

"నాజీతంతోటి యిల్లు కొనుటానికి అడ్వాన్సు యిచ్చిన. ఇంటికి పంపిన యన్ని ఎక్కువ కెక్కువ కోడలు జీతమే" అని చెప్పాడు.

చాలామంది ఈర్ష్య అసూయతో రగిలిపోయారు. ఆ యింటి కోడలు "మహాలక్ష్మి" అని కొందరు పెద్దలు దీవించారు. పిల్లలు పాదాభివందనం చేశారు. పల్లెటూరి బంధువుల్లో యింత ఆదరం చూసి చలించిపోయింది దివ్య. అప్పటికే నీళ్ళు పోసుకున్న దివ్య వారి ప్రశంసలతో నిండుగా మరింత కళ తేలింది.

రవిప్రకాశ్ తల్లిదండ్రులకు పాస్‌పోర్టు అప్లయి చేయించాడు. మళ్ళీ స్టేట్స్‌కు పోతూపోతూ తల్లినీ, తండ్రినీ స్టేట్స్ రమ్మని మరిమరి చెప్పారు కొడుకూ కోడలూ. గంగాధర్, రామేశం కలిసి లస్మయ్య లచ్చుంబాయిలను రెండు సార్లు మద్రాసుకు తీసుకువెళ్లారు. ఒక్కొక్కరికి నాలువేల ఆరువందల రూపాయలు డ్రాఫ్ట్ తీసి వాళ్లిచ్చిన తేదీ ప్రకారం వెళ్లారు.

మొదటిసారి అమెరికా వీసా కార్యాలయంలో ఏం మాట్లాడాలో తెలియక అయోమయం అయ్యారు. వీసాలు రిజక్టు అయ్యాయి. రెండవసారి వెళ్లేముందు అక్కడ ఎలా మాట్లాడాలో, ఏమ్మాట్లాడాలో నలుగురు నాలుగురకాల ట్రేనింగ్ ఇచ్చారు. అయినా మేము రాము అని మొండికేశారు. ఆ పరీక్షలన్నీ ఎంతో అవమానం అనిపించాయి. గంగాధర్ రామేశం ఎంతో బతిమాలి బయలుదేర దీశారు. ఏవేవో కాగితాలన్నీ పంపిస్తే, గంగాధర్ రామేశమే అవన్ని చూసు కున్నారు. అలా మద్రాసులో వీసా స్టాంపయ్యింది.

దివ్యకు పొద్దులు నిండాయి. తల్లిదండ్రులను పిలిపించుకోవాలనుకున్నాడు రవిప్రకాష్. ఫ్లైట్ టికెట్లు స్టేట్స్ నుంచి రిజర్వు చేసి పంపాడు.

జగిత్యాలనుంచి అమెరికాకు బయలుదేరడానికి ఏమేమి తీసుకురావాలో ఫోన్లో కొడుకు కోడలు, హైదరాబాదునుండి వియ్యంకుడు బి.డి.ఎల్. శివరాం అనేక విధాలుగా చెప్పారు. కొన్ని తానే కొన్నానని మీరు అవి కొనాల్సిన అవసరం లేదని వియ్యంకుడు, వియ్యపురాలు చెప్పారు. సూట్‌కేసుల్లో ఎలా సదురుకోవాలో కూడా సముదాయించారు. అంతపెద్ద సూట్‌కేసులు ఎలా మోయాలో లస్మయ్య లచ్చుంబాయి దంపతులకు అర్థం కాలేదు. విమానాశ్రయాల్లో సూట్‌కేసులను పెట్టుకొని నూక్కపోయే చిన్న గీరెల బండ్లు ఉంటాయని లింబాద్రి రామేశం, శివరాం తాము కూడ వెంట ఉంటామని బరోసా ఇచ్చారు.

అలా లస్మయ్య, లచ్చుంబాయిలతోపాటు లింబాద్రి, రామేశం, చంద్రమౌళి నాలుగు పెద్ద సూటుకేసులు తీసుకొని కార్లలో బయలుదేరారు. శివరాజం దంపతులు విమానాశ్రయంవద్ద కలుసుకున్నారు. హైద్రాబాద్ విమానాశ్రయంలో వియ్యంకులు, వియ్యపురాళ్లు, అల్లుళ్లు, కూతుళ్లు...

వాళ్లందరిని చూస్తుంటే గతం గుర్తుకొచ్చి కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. అందరిని అలాయి బలాయి తీసుకున్నారు. కూతుళ్లు కన్నీళ్లు పెట్టారు. రెండు గంటలు నిరీక్షణ తరువాత లోపలికి వెళ్లారు.

లచ్చుంబాయి, లస్మయ్య విమానంలో వెళ్తుంటే మేఘాలన్నీ కింద కనపడడం - బొంబాయి, లండన్ నగరాల మీదుగా పోతుంటే దేవలోకం పోతున్నట్టుగా అనుభూతి.

ఫ్లయిట్ దిగగానే విమానాశ్రయంలో కొడుకు ఎదురు చూస్తున్నాడు. తమ కొడుకు కొన్న సొంత కారులో పోతుంటే చెప్పలేని ఆనందం.

ఎంత అందమైన రోడ్లు... ఎంత మంచిగుంది ఊరు అని అనుకోకుండా వుండలేకపోయారు.

కొడుకు రవిప్రకాశ్ కొన్న ఇల్లు చాలా అందంగా ఉంది. సినిమాలో చూసినట్టుంది. 800 గజాల జాగలో విశాలంగా యిల్లు. జీవితంలో కలలో కూడా ఊహించని ఇల్లు.

ఓ రోజు తండ్రి లస్మయ్య "ఎంత కిరాయి" అని కోడలు నడిగితే "మీకొడుకునే అడుగు మామయ్యా" అంది నిండు పొద్దులతో వున్న దివ్య నిండుగా నవ్వుతూ.

"ఇల్లుకు అడ్వాన్సు కట్టిన అని ఇదివరకు చెప్తిని కదనే. ఇదే ఇల్లుకు... దీనికి పదిహేను సంవత్సరాలు నెల నెల కిస్తులు కట్టాలె" అన్నాడు రవిప్రకాశ్.

"ఎంతుంటది? పదిలక్షలుంటదారా!" అని అడిగింది తల్లి లచ్చింబాయి.

తల్లి అమాయకత్వాన్ని చూసి ఆత్మీయంగా నవ్వి దగ్గరికచ్చి తల్లి చేయి పట్టుకొని

"కోటి యిరవై లక్షలు" అన్నాడు రవిప్రకాశ్ మెల్లగా.

ఆ లెక్క విలువ ఆతల్లి ఊహకందలేదు.

"పెద్ద కోడలు మన యింటికొచ్చిన యాల్ల" అంటూ కొడుకూ, కోడల్ని దీవించింది లచ్చింబాయి.

లచ్చుంబాయి కోడలు చెప్పినట్లు వినుకుంటూ కొత్త వంటలన్నీ నేర్చుకున్నది. గ్యాస్ స్టౌవ్, వాషింగ్ మెషిన్, గిన్నెలు క్లీన్ చేసే మెషిన్, వాక్యూం క్లీనర్, గ్రైండర్ మిక్సీలు ఎలా వాడాలో తెలుసుకుంది. అమ్మ వంటలు సూపర్ అని కొడుకు, కోడలు మెచ్చుకుంటుంటే ఆనందపడిపోయింది లచ్చుంబాయి.

మరో నెలకు దివ్యకు నార్మల్ డెలవరీ...

మనుమరాలు పుట్టింది అని లస్మయ్య, లచ్చుంబాయి ఎంతో సంతోష పడిపోయారు.

నెలకూడా కాకముందే దివ్య డ్యూటీలో జాయినైంది. మనుమరాలు పుట్టుకతో మరో కొత్త కథ మొదలైంది.

ఆమె పుట్టుకతోనే అమెరికన్ అట.

లస్మయ్యకు, లచ్చింబాయికి అదంతా కలలోలాగా ఉంది.

ఒక్కడు చదువు కొని బుద్ధిమంతుడైతే తమ కుటుంబమంతా ఎంత మారిపోయింది.

తమకు అమెరికన్ మనుమరాలు పుట్టింది. "అమెరికన్ మనుమరాలు" అని మనస్సులో పదే పదే అనుకున్నారు.

మనవరాలు పుట్టిన్నించి వియ్యంకుడు, వియ్యపురాలు, కొడుకులు, బిడ్డలు, అల్లుళ్ళు, చంద్రమౌళి, రామేశం ఇండియానుండి ఎవరో ఒకరు ఎప్పుడు ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నారు. అమెరికా నుండి ఇండియాకు, ఇండియా నుండి అమెరికాకు వారంలో మూడు నాలుగు సార్లు ఎవరో ఒకరు ఫోన్లో మాట్లాడుతుంటే అందరూ ఎంతో దగ్గరున్నట్లు పక్కవాడలో ఉంటున్నట్లు అన్పించింది వారికి.

ఓరోజు వీకెండ్లో అయిదారుగురు రవిప్రకాశ్ యింట్లో మీటయ్యారు. ఏదేదో చర్చిస్తున్నారు.

కోడలు దివ్యకూడా ఉత్సాహంగా ఆ చర్చలో పాల్గొంది.

రవిప్రకాశ్ కొలీగ్, బెస్ట్‌ఫ్రెండ్ అమరేందర్ ఆ చర్చలో రవిప్రకాశ్‌ను మాటిమాటికి తప్పుపడ్తున్నాడు. నవ్వుతూనే సీరియస్ అవుతున్నాడు.

"నీకు మొదటినుంచీ చెబుతున్నాను. ఇల్లు కొనద్దని. ఇల్లు కొని పదిహేను సంవత్సరాల దాకా కిస్తులు కట్టుకుంటూ డబ్బంతా డెడ్ క్యాపిటల్ చేస్తున్నావు".

అమరేందర్ మాటలకు దివ్య అడ్డొచ్చింది.

"ఇప్పుడు ఏమంత కొంప మునిగిందని, ఏపాటి ఏజ్ వచ్చిందని, అందరూ థర్టీ ప్లస్ వాళ్ళే కదా! నాకైతే టొంటీ సెవెనే! ఇండియాలో మా క్లాస్‌మేట్స్ కొందరికి ఇంకా ఉద్యోగాలు కూడా రాలేదు. అయినా ఇల్లు కిరాయకు నెలకు వెయ్యిడాలర్లు ఎలాగూ కట్టాల్సిందేగా! మరో ఏడువందలే కదా ఎక్స్‌ట్రా కడుతున్నది? సరే! జరిగిపోయినదాన్ని వదలేయండి. ఇప్పుడేం చేద్దామో చెప్పండి."

"నాకైతే ఇప్పుడప్పుడే రిస్క్ తీసుకోవడం ఇష్టంలేదు" అన్నాడు చంద్రమౌళి అల్లుడు ప్రవీణ భర్త పార్థసారథి.

"రిస్క్ తీసుకోకపోతే జీవితమే లేదు. రిస్క్ లేకుండా ఒక్కక్షణం కారు కూడా నడపలేవు. రిస్క్ లేనిదెక్కడ? ఈ ఉద్యోగాలు శాశ్వతమా? ఇదేమైనా ఇండియానా?" అన్నాడు మరో స్నేహితుడు విశ్వేందర్‌రెడ్డి.

ప్రవీణ "మా ఆయన మొదట అలానే అంటారు. తర్వాత అందరికన్నా తానే ముందుంటారు" అంటూ నవ్వింది.

అలా చర్చ సాగుతూనే ఉంది.

"ఇంకా ఎంతకాలం యిలా ఎంప్లాయిస్‌గా రొటీన్‌గా, బోర్‌గా బతకడం? మనం ఏదైనా అడ్వెంచర్ చేయాలి. ఏదైనా వెంచర్ ప్రారంభించాలి. మనం మరింత ఉన్నత దశకు ఎందుకు ఎదగకూడదు?" అన్నాడు అమరేందర్.

"మనం కూడా ఒక సాఫ్టువేర్ కంపెనీ ఎందుకు స్టార్ట్ చేయకూడదు? రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 300 డాలర్లు చాలు. ఇంతమందిమి కలిసి ఒక సంస్థను నిర్వహించలేమా? మనకాశక్తి లేదా? మనమంతా కలిస్తే అది అసాధ్యమా?" అంటూ విజయ్ వాదనకు దిగాడు.

చివరకు అందరూ ఒక అంగీకారానికి వచ్చారు. దివ్య యం.డిగా ఓ సాఫ్టువేర్ కంపెనీ, రిజిష్టరు చేయడానికి ఒత్తిడి చేశారు.

దివ్య వద్దు వద్దంటూనే వుంది. కానీ ఆమె ముఖంలో మరింత తేజస్సు. ఆమెకు లోలోపల ఉత్సాహంగానే ఉంది.

ఏదో ఊబిలోకి దిగుతున్నట్టుగా భయపడ్డాడు పార్థసారథి.

“ధైర్యంగా ఉండండి. గతం మర్చిపొండి. ఇపుడు మరో ‘ప్యారడిగ్మ్ షిఫ్టు’కు స్టెప్ తీసుకున్నాం. తప్పకుండా సక్సెస్ అవుతాం. ఇకనుండి మనజీవితాల్లో కొత్త కథ ప్రారంభం...” అన్నాడు విజయ్ ఉత్సాహంగా.

అంతలో ఫోన్ మ్రోగింది. రిసీవర్ అందుకుంది దివ్య. అవతలినుండి చంద్రమౌళి. మాటల్లో దివ్య తమ ప్రతిపాదన చెప్పింది. అంకుల్‌ను సూచనలడిగింది. చంద్రమౌళి ఎంతో సంతోషపడిపోయాడు. అందరికి వినపడేట్లుగా స్పీకర్ ఫోన్ నొక్కింది దివ్య.

“మాకు వెనకటి కాలంలో టీచర్ ఉద్యోగం దొరకడమే గగనంగా వుండేది. మీ జనరేషన్లో కొందరైనా స్టేట్స్ పోగలిగారు. మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు లాలాలజపతిరాయ్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, ఎ.కె.రామానుజం, సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తొస్తున్నారు. 150 ఏళ్ళ క్రితం నుండి వాళ్ళకు యితర దేశాలకు వెళ్ళే అవకాశాలు వచ్చాయి. అలాంటి అవకాశాలు యిప్పుడు మీకు వస్తున్నాయి. మీ జీవితం యిపుడే మొదలైంది. ఇక ఉన్నత శిఖరాలకు ఎదగడం మీ సంకల్ప బలాన్ని బట్టి, ఉత్సాహాన్ని బట్టి వుంటుంది. బిల్ గేట్స్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? సత్యం, ఇన్ఫోసిస్ రామలింగరాజు, నారాయణ మూర్తి గారలకెవరు చెప్పారు? గుమాస్తా జీవితాన్ని ప్రారంభించిన రిలయన్సు అంబానీకి ఎవరు చెప్పారు ఎదగాలని? అనాథగా పుట్టిపెరిగిన ఫోర్డ్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? అంతా సంకల్పబలం, పట్టుదల, నిరంతర కృషి. విశ్వవిజేత అలెగ్జాండర్ ఒక మాటన్నాడు. గెలవదలుచుకున్నవారికి ఈ ప్రపంచం చాలా చిన్నది అని. నేను ఇంతకన్నా కొత్తగా, అదనంగా చెప్పడానికేమీ లేదు. మీరు ఎంతగా

ఎదిగితే అంతగా సేవచేసే అవకాశం ఉంటుంది. ఈ విషయం మాత్రం మర్చిపోవద్దు. బెస్టాఫ్ లక్" అన్నాడు చంద్రమౌళి.

అందరు సంతోషంతో చప్పట్లు.

ఎందుకో తెలియక అయోమయంగా చూశారు లస్మయ్య, లచ్చింబాయి.

తమ కొడుకు, కోడలు ఏపని చేసినా మంచిపనే చేస్తరు అని మనస్సులో తృప్తి నిలుపుకున్నారు లచ్చింబాయి, లస్మయ్య. వారికి గతమంత కళ్ళ ముందు కదలాడుతోంది.

కూతుళ్ళమీద ప్రాణం కొట్టుకుంటోంది. అల్లుళ్ళుకూడా ఇక్కడికివస్తే ఎంత మంచిగుండు అనుకున్నారు. అదేమాట వాళ్లను అడిగారు.

"అలాంటివాళ్లకోసమే ఈ సంస్థ పెడుతున్నది. వాళ్లక్కడ కంప్యూటర్ ట్రైనింగ్ చేస్తే ఇక్కడ ఏదో చిన్నపనైనా ఇప్పియ్యవచ్చు. అదే మా ప్రయత్నం" నవ్వుతూ అన్నాడు విజయ్.

ఆదివారం వార్త 21-8-2005

❄ ❄ ❄



చికాగోలో శ్రీకాంత్, శైలజ, శ్రీవర్, శ్రీయాన్